
సాక్షి ఒడిశా

శనివారం । 12 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,11,863లు, బంగారం 21 గ్రాముల 300 మిల్లీ గ్రాములు, వెండి 392 గ్రాముల 350 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దోపిడీ దొంగలు అరెస్టు

బరంపురం పోలీసు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టిన పోలీసులు బైక్‌లు, సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ముఠాను అరెస్టు చేశారు.

- 10లో



సబ్ జైల్ సందర్శన

కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర ఆదేశాల మేరకు కోట్‌పాడ్ సబ్ జైలు, బొయిపరిగుడలో వృద్ధాశ్రమాలను సందర్శించారు.

- 10లో

రాష్ట్రంలో రాజకీయ మైత్రి

- మారుతున్న సమీకరణాలు
- బీజేడీ – బీజేపీ పొత్తు..!
- పూర్వ వైభవానికి కాంగ్రెస్ ప్రయత్నాలు
- సొంతగూటికి గిరిధర్ గొమాంగో..?



భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ శిబిరాల్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా కేంద్రంలో అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ), రాష్ట్రంలో అధికార పార్టీ బిజూ జనతా దళ్ (బీజేడీ)ల పొత్తు పోకడపై సర్వత్రా వాడీవేడిగా చర్చ సాగుతోంది. వాస్తవానికి అప్పట్లో బీజేపీ చేయూతతో రాష్ట్రంలో బీజేడీ అధికారంలోకి వచ్చింది. అనంతరం రాజకీయ ఎత్తుగడల్లో అవగాహన బలపడడంతో బీజేపీతో పొత్తు తెంచుకుని బీజేడీ ఏక ఛత్రాధిపత్యం నిరవధికంగా కొనసాగిస్తోంది. అయితే 2 దశాబ్దాల కిందటి రాజకీయ వ్యూహాత్మక పరిస్థితులు నేడు కనిపించడం లేదు. రాజకీయ పోకడలో భారీ సంస్కరణలు, మార్పులు అనుక్షణం చోటుచేసుకుంటున్నాయి. లోగడ కాంగ్రెస్ హటావో నినాదంతో కాంగ్రెసేతర కూటమి గద్దెనెక్కిన రీతిలో, ప్రస్తుతం బీజేపీ హటావో నినాదంతో బీజేపీయేతర వర్గాలు ఒక తాటిపైకి వచ్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. సమస్యాత్మక రాజకీయ వాతావరణం మధ్య ఆచితూచి అడుగు వేయడంలో బీజేపీ, బీజేడీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. నవీన్ పట్నాయక్ నేతృత్వంలో గెలుపు తప్ప ఓటమి చవిచూడని బిజూ జనతా దళ్ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజేతగా నిలవాలని యోచిస్తోంది.

కాంగ్రెస్‌లోకి గిరిధర్ గొమాంగో..?

మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో, ఆయన తనయుడు శిషిర్ గొమాంగో త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. వీరిరువురు కాంగ్రెస్ గూటికి చేరేందుకు అగ్రస్థాయి నాయకులతో మంతనాలు బలంగా జరుపుతున్నట్లు సమాచారం. గిరిధర్, శిషిర్ కాంగ్రెస్‌లో అగ్రశ్రేణి నాయకులుగా గుర్తింపు పొందిన తర్వాత పార్టీలు ఫిరాయించి పలుచోట్ల అభాసుపాలయ్యారు. కాంగ్రెస్ నుంచి ఫిరాయించి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆ పార్టీలో వీరికి సముచిత గుర్తింపు కొరవడడంతో తెలంగాణాలో ఆవిర్భవించిన భారతీయ రాష్ట్రీయ సమితి(బీఆర్‌ఎస్) తీర్థం పుచ్చుకున్నారు. జాతీయ స్థాయి పార్టీగా ఢంకా బజాయించిన బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో తండ్రీకొడుకులు ప్రధాన సారథులుగా నిలుస్తారనే కలలు కల్లలైపోయాయి. ఈ పరిస్థితుల నుంచి సకాలంలో బయటపడాలనే దృక్పథంతో గిరిధర్ గొమాంగో, ఆయన కొడుకు శిషిర్ గొమాంగో సొంత శిబిరం కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీకి వీరివురి ప్రాతినిధ్యం ఎంతవరకు దోహదపడుతుందోననే అంచనాలతో పార్టీ అధిష్టానం సమీక్షిస్తోంది. దక్షిణ ఒడిశా ప్రధానంగా రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో గొమాంగో పరివారం రాజకీయంగా బలమైన ఉనికిని కలిగి ఉన్న వర్ధమాన రాజకీయ సమీకరణాలకు ఎంతవరకు ఉపకరిస్తుందోనని పార్టీ హైకమాండ్ లెక్కగడుతోంది.

బ్యూరోక్రాట్ల మోజు

ఇటీవల కాలంలో రాష్ట్రంలో పలువురు బ్యూరోక్రాట్లు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ శిబిరాల్లో ఈ వాతావరణం క్రమంగా బలపడుతోంది. అధికారంలో కొనసాగుతున్న బిజూ జనతా దళ్‌కు అధికారం, హోదాలో ఉన్న బ్యూరోక్రాట్లు తెర వెనక కథానాయకులుగా నడిపిస్తున్నట్లు బాహాటంగా ఆరోపణలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి వ్యక్తిగత (5టీ) కార్యదర్శి వి.కె.పాండియన్ రాష్ట్రం అంతటా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధిగా ఆయన ప్రజలను ఆకట్టుకుంటుండడం విశేషం.

బీజేపీకి అనుకూలంగా

పరోక్షంగా కాంగ్రెస్‌ను నిరాకరించి బీజేపీకి అనుకూలంగా బీజేడీ తరచూ స్పందిస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో బీజేపీ, బీజేడీ మధ్య పొత్తు లేదు. వైరి పక్షాలుగా చలామణి అవుతున్నాయి. కేంద్రస్థాయిలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ పార్టీ భారతీయ జనతా పార్టీతో పొత్తుగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. బీజేపీ అగ్రస్థాయి నేతలు రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ మధ్య సానుకూల వాతావరణం నెలకొల్పేందుకు లోపాయికార ప్రయత్నాలు చేపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సీఎం నవీన్ అభీష్టం మేరకు రాష్ట్రంలో పోటీకి, సీట్ల సర్దుబాటుకు బీజేపీ జాతీయ స్థాయి వర్గం సానుకూలంగా స్పందించి రాష్ట్ర శాఖ కార్యకర్తలను బుజ్జగించే ప్రయత్నంలో తలమునకలై ఉన్నట్లు ఈ వర్గం భోగట్టా.

ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధం

రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ పొత్తు వ్యవహారాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ నడుం బిగిస్తోంది. ఈ శిబిరంలో అసంతృప్తి, అంతః కలహాలు, భేదాభిప్రాయాలు అధిష్టానానికి తలకుమించిన భారంగా పరిణమిస్తున్నాయి. ఈ విషమ పరిస్థితి నుంచి బయటపడి, రానున్న ఎన్నికల్లో పూర్వ వైభవం కూడగట్టుకునే దిశలో రాష్ట్ర కాంగ్రెస్ ఆలోచిస్తోంది. నాయకత్వ లక్షణాలకు పెద్దపీట వేసి, సమైక్య నినాదంతో కార్యకర్తల్లో ఉమ్మడి కృషి భావాల్ని ప్రేరేపించేందుకు రాష్ట్రస్థాయిలో అగ్రశ్రేణి నాయకులు పావులు కదుపుతున్నారు. మరోవైపు కాలమాన పరిస్థితులకు అనుగుణంగా లోగడ పార్టీ ఫిరాయించిన పలువురు ప్రముఖులు తిరిగి కాంగ్రెసు గూటికి చేరేందుకు యోచిస్తున్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పండాకు స్వాగతం పలుకుతున్న సిద్దార్థ పట్నాయిక్

జయపురం: జయపురం నూతన సబ్ కలెక్టర్‌గా సీనియర్ అధికారి ప్రభాత్ కుమార్ పరిడ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్, తహసీల్దార్ శ్రీమతి సాగరిక షాడంగిలు స్వాగతం పలికారు. ప్రభాత్ కుమార్ పరిడ గతంలో గంజాం జిల్లా హింజిలి తహసీల్దార్‌గా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడికి విచ్చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన బేదబర ప్రధాన్ మల్కన్‌గిరి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు.

రామమూర్తి గొమాంగోకి బెయిల్



మాజీ ఎమ్మెల్యే రామమూర్తి గొమాంగో

భువనేశ్వర్: భార్యను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న గుణుపూర్ మాజీ ఎమ్మెల్యే రామమూర్తి గొమాంగోకు ఒడిశా హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 4 నెలల గర్భిణిగా ఉన్న భార్యను 1995 ఆగస్టు 29న హత్య చేసిన కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. స్థానిక అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) కోర్టు దాదాపు 28 సంవత్సరాల తర్వాత, భార్యను హత్య చేసిన నేరానికి సంబంధించిన 11 మంది సాక్షుల వాంగ్మూలాలు మరియు 15 పత్రాలను పరిశీలించిన తర్వాత హత్య మరియు సాక్ష్యాలను నాశనం చేసినందుకు న్యాయస్థానం గొమాంగోను దోషిగా నిర్ధారించింది. ఈ ఏడాది జూన్ 27న కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

గ్రామీణ డాక్ సేవకుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న డాక్ సేవకులు

జయపురం: అఖిల భారత గ్రామీణ డాక్ సేవక సంఘం పిలుపు మేరకు స్థానిక ప్రధాన తపాల కార్యాలయం ఎదురుగా గ్రామీణ డాక్ సేవకులు గురువారం ధర్నా నిర్వహించారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి 8 గంటల పనికి జీతం ఇవ్వాలని కోరారు. 7వ వేతన కమిషన్ సిఫార్సులు, కమలేష్ చంద్ర కమిషన్ రిపోర్టు అమలు చేయాలని విన్నవించారు. గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పన తదితర డిమాండ్లు పరిశీలించాలన్నారు. రెండు నెలల్లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పీఎస్‌పీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర సాహు, కొరాపుట్ డివిజన్ అధ్యక్షుడు దేవరాజ్ దాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీష్ ఖర్, సహాయ కార్యదర్శి శిశిధర గంతాయిత్, కార్యదర్శి సహదేవ్ హరిజన్, శరత్ దాస్, అరుణ మిశ్ర, కైలాశ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



దైతారి మృతదేహం

రాయగడ: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని మునిగుడ సమితి తెలంగాపదర్ పంచాయతీ బిల్‌కకుటి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇంట్లో మోటారు ఆన్ చేసేందుకు స్విచ్ వేసే సమయంలో షాక్ తగలడంతో దైతారి ఎండూరి (27) అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మునిగుడ ఆస్పత్రికి తరలించినా, అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండగా ఉంటాం.. ఆదుకుంటాం

- ప్రజలకు భరోసా ఇస్తున్న మైత్రీ సంస్థ

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్న మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజమాన్యం ప్రజలకు భరోసా ఇస్తోంది. మీకు మేము అండగా ఉంటాం.. సమస్యలు తెలియజేయండని మైత్రీ అధినేత శ్రీనివాస్‌రావు ప్రజలతో మమేకమవుతున్నారు. కొద్దిరోజుల క్రితం సుంగేరు పంచాయతీలో పర్యటించిన శ్రీనివాస్‌రావు గ్రామానికి చెందిన నిరుపేద సుశాంత్ నాయక్ కుమారుడు భవానీ శంకర్ (13)కు గుండె ఆపరేషన్‌ను ఉచితంగా చేయించడంతో ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నాడు. దీంతో మైత్రీ సంస్థకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సుంగేరు పంచాయతీ డుమురిపాదొరాలో పర్యటించిన మైత్రీ అధినేతకు గ్రామస్తులు స్వాగతం పలికారు. గ్రామంలోని తాగునీరు, రహదారులు తదితర సమస్యలను వివరించారు. దీంతో సమస్యలు పరిష్కరించేందుకు సంస్థ హామీ ఇచ్చింది. పరిశ్రమల ఏర్పాటు వలన పరిసర ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయని శ్రీనివాస్‌రావు వారికి వివరించారు. కార్యక్రమంలో మైత్రీ సీఈవో ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డుమురిపాదొరొ గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న మైత్రీ అధినేత శ్రీనివాస్‌రావు

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



హోటల్ ప్రిన్స్ కిచెన్‌ను సీజ్ చేస్తున్న అధికారులు



ఒక దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: మున్సిపాలిటీలోని పలు హోటళ్లపై జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగి జగదీశ్‌రావు నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రవాస్ కుమార్ తదితరులు దాడులు నిర్వహించినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ వెల్లడించారు. ఈ సందర్భంగా హోటల్ వుడ్స్ యాజమాన్యానికి రూ.5,000లు, హోటల్ ప్రిన్స్ యాజమాన్యానికి రూ.20,000లు జరిమానా విధించినట్లు తెలియజేశారు. అలాగే మరికొన్ని హోటల్స్‌పై దాడులు నిర్వహించి మొత్తం రూ.40,300లు వసూలు చేశామన్నారు. అదేవిధంగా పాలిథిన్ వినియోగ దుకాణాలపై, పాలిథిన్ అమ్మకందారులపై దాడులు నిర్వహించి రూ.2,500లు జరిమానాలుగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. హోటళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

గంజాయితో పట్టుబడిన ప్రయాణికుడు



గంజాయి, నగదుతో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు



గంజాయితో పట్టుబడిన నిందితుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఒక ప్రయాణికుడి నుంచి ఆర్పీఎఫ్ పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే ఆర్పీఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో రైల్వేస్టేషన్‌లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై వినోద్ అనుమానస్పదంగా కనిపించడంతో ప్రశ్నించారు. అనంతరం అతడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా 4 కిలోల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని అంచనా వేశారు. గంజాయితో పాటు నిందితుడిని ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

జిల్లాలోని చంద్రపూర్‌లో గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వెళ్తున్న కారును తనిఖీ చేయగా 10 కిలోల గంజాయితో పాటు రూ.2,77,300 నగదు పట్టుబడింది. అలాగే రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు

- కస్టమర్ సర్వీస్ పాయింట్‌లు ఏర్పాటు
- రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం



మంత్రి మండలి నిర్ణయాలు తెలియజేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి విక్రమ కేశరి అరూఖ్

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక బ్యాంకింగ్ సేవలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి మండలి మార్గం సుగమం చేసింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ తీర్మానం మేరకు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కస్టమర్ సర్వీస్ పాయింట్‌లు ఏర్పాటవుతాయి. ఈ సమావేశంలో పలు విభాగాలు, శాఖలు ప్రతిపాదించిన 19 ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది

6 బ్యాంకుల సమన్వయంతో...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా మరియు బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి 6 ప్రభుత్వ రంగ బ్యాంకుల సమన్వయంతో సీఎస్‌పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్) ప్లస్ బ్యాంకింగ్ అవుట్ లెట్‌ను ప్రారంభించే పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని గ్రామ పంచాయతీల్లో సకాలంలో ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ప్రక్రియ నిర్వహణకు ఈ పథకం దోహదపడుతుంది. ఈ పథకం కోసం రాష్ట్ర మంత్రి మండలి సుమారు రూ.5,00 కోట్ల బడ్జెట్ మద్దతు ప్రకటించింది. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరం 2023–24లో ప్రతిపాదిత 4,373 గ్రామ పంచాయతీల్లో దశలవారీగా సీఎస్‌పీ ప్లస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి మండలి ఆదేశించినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విక్రమ కేశరి అరూఖ్ తెలిపారు. ఈ పథకం నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు అద్దె రహిత బ్యాంకింగ్ స్థలాన్ని అందిస్తుంది. అదనంగా 3 సంవత్సరాల పాటు స్థిర మరియు పునరావృత ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

జట్నీలో కేన్సర్ ఆస్పత్రి

టాటా మెమోరియల్ సెంటర్ ఆధ్వర్యంలో కేన్సర్ ఆస్పత్రి మరియు ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రి మండలి సానుకూలంగా స్పందించడం విశేషం. ఖుర్దా జిల్లా జట్నీ ప్రాంతం నైజర్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) ప్రాంగణంలో ఈ సెంటర్ ఏర్పాటు అవుతుంది. దీని కోసం సమగ్రంగా 48.842 ఎకరాల ప్రభుత్వ భూమిని ఛార్జీలు లేకుండా లీజుకు ఇచ్చేందుకు క్యాబినేట్ అంగీకరించింది. తృణ ధాన్యాల అభివృద్ధి మరియు వినియోగంపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. దీని కోసం రూ. 2,687.4587 కోట్లతో అదనపు బడ్జెట్ అందుబాటులోకి వస్తుంది.

నూతన ఉన్నత అభిలాష పథకం

సుమారు రూ.385 కోట్ల వ్యయ ప్రణాళికతో నూతన ఉన్నత అభిలాష (ఎన్‌యూఏ) పథకానికి క్యాబినేట్ అంగీకరించింది. రానున్న 3 సంవత్సరాల్లో ఈ పథకం కింద ప్రతి సంవత్సరం లక్ష మంది యువతకు శిక్షణనిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లో నూతన ఉన్నత అభిలాష పథకం అమలు చేయబడుతుంది. నైపుణ్యాభివృద్ధి మరియు సాంకేతిక విద్యాశాఖ (ఐటీఐ, పాలిటెక్నిక్), ప్రభుత్వ నైపుణ్య సంస్థలు, విద్యా సంస్థలు మరియు క్లస్టర్ల నైపుణ్య సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్యం, రీస్కిల్లింగ్ మరియు అప్–స్కిల్లింగ్ అవకాశాలతో ప్రత్యేక శిక్షణ కల్పిస్తారు. అభివృద్ధి చెందుతున్న ట్రేడ్‌లలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరతను పరిష్కరిస్తూ, హస్తకళ, చేనేత మరియు వ్యవసాయం వంటి సాంప్రదాయ రంగాలలో కొత్తతరం యువతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో నైపుణ్యత లోటు తగ్గించడానికి ఎన్‌యూఏ సహాయపడుతుంది.

‘జొడియాలను ఆదివాసీలుగా గుర్తించండి’

రాయగడ: జొడియా సాంప్రదాయ ప్రజలను ఆదివాసీలుగా గుర్తించాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో అత్యధిక శాతం మంది జొడియా సాంప్రదాయ ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. 1997వ సంవత్సరం వరకు ప్రభుత్వ పథకాలు పొందే ఈ తెగకు చెందినవారు, అనంతరం ఆ సౌకర్యాన్ని పొందలేకపోయారని వివరించారు. దీంతో తెగకు చెందినవారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోవడంతో పాటు వారి పిల్లలు చదువుకునేందుకు సైతం నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలుగా గుర్తిస్తే ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధిస్తారని తెలియజేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు.



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదులి

నమ్మించి ముంచారు

- ఉత్కళ అల్యూమిన కర్మాగారంపై నిరసన సెగలు
- రాయగడలో భారీ ర్యాలీ



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డికొరల్ గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఉన్న ఉత్కళ అల్యూమిన కర్మాగారంపై డికొరాల్ గ్రామస్తులు వ్యతిరేక నినాదాలు చేస్తూ శుక్రవారం రాయగడలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో వందలాది మంది మహిళలు, యువకులు పాల్గొని కలెక్టర్ కార్యాలయం మెయిన్ గేటు వద్ద నిరసన తెలియజేశారు. కర్మాగారం యాజమాన్యం తమను నమ్మించి నట్టేట ముంచిందని నినాదాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పేరిట ఒక వినతిపత్రాన్ని ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్‌కు అందజేశారు.

డికొరల్ గ్రామాన్ని తరలించండి

కర్మాగారం ఏర్పాటు కోసం డికొరల్ గ్రామస్తులు తమ వ్యవసాయ భూములను యాజమాన్యానికి అప్పగించారు. అందుకు నామమాత్రం నష్టపరిహారం చెల్లించి యాజమాన్యం తమను మోసం ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారానికి సమీపంలో ఊరు ఉండడంతో శబ్ధ కాలుష్యం, వాయు కాలుష్యం ద్వారా తామంతా రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. అందువలన తమ గ్రామాన్ని వేరే చోటుకు తరలించి, పునరావాసం కల్పించాలని ఇదివరకే తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు హలధర్ నాయక్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని పలుసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, అలాగే రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినా ఇంతవరకు స్పదించలేదని తెలిపారు. ఇప్పటికైనా తమను వేరేచోటుకు తరలించి సౌకర్యాలు కల్పించాలని, లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ హామీ ఇచ్చారు.



ఏడీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రాములోరి హుండీల ఆదాయం రూ.20.12 లక్షలు



దేవస్థానం ప్రాంగణంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థాన హుండీల ఆదాయాన్ని దేవస్థాన అధికారులు శుక్రవారం లెక్కించారు. మూడు నెలలకు దేవస్థానంలో ఉన్న అన్ని హుండీల ద్వారా రూ.20,12,436 ఆదాయం లభించిందని ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన శ్రీవారి సేవా భక్తులు, దేవస్థాన సిబ్బంది హుండీల ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు. జామి ఎల్లారమ్మ దేవాలయ ఈఓ ప్రసాదరావు హుండీ లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు.

14న మహిళలతో బైక్ ర్యాలీ

పార్వతీపురం: నానేల–నాదేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు శుక్రవారం తెలిపారు. 14న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రారంభించి, పాల్గొంటారన్నారు. దేశభక్తి పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నామని ఆసక్తిగల మహిళలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, ఏఎంఓ పి.కోటిబాబు, డీఈలు ఢిల్లేశ్వరరావు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

విజయనగరం క్రైమ్: రింగురోడ్డు సమీపంలో హనుమాన్ టవర్స్‌లో నివాసం ఉంటున్న కొల్లూరు సీతారత్నం మెడలో బంగారం గొలుసులు లాక్కుని నిందితుడు పరారయ్యాడు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్సై షేక్‌శంకర్ శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు సెంటర్‌కు వచ్చిన ఆమె కొనుగోలు అనంతరం తిరిగి ఇంటికి వెళ్లి, మెట్లు ఎక్కుతుండగా రెడ్ షర్ట్ వేసుకుని, హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న సుమారు ఐదు తులాల రెండు బంగారు గొలుసులు లాక్కుని పరారయ్యాడు. వెంటనే బాధితురాలి బంధువులు డయల్ 100కి సమాచారం అందించగా టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన బాలికను లైంగిక వేధింపులకు గురిచేయడంతో పాటు తనతో తీసుకుని వెళ్లిపోవడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్సై గంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దొంగతనం కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష

తెర్లాం: దొంగతనం కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ఎం.సరోజినమ్మ తీర్పు ఇచ్చినట్లు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని మెండి వీధికి చెందిన చంద్రశేఖరరావు(చిన్నపిల్లల డాక్టర్) ఇంట్లో 2019–20 సంవత్సరంలో కుమారరాజా అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడి రూ.90వేలు నగదు అపహరించాడని అప్పట్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేయగా విచారణ అనంతరం బొబ్బిలి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించిందని చెప్పారు. ఈ కేసును ఏపీపీ నరేష్ వాదించారని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సీతంపేట: మండలంలోని కొత్తగూడ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. మొత్తం 47 బస్తాల (2300 కిలోలు) బియ్యం పట్టుబడ్డాయి. జామితోటకు చెదిన వ్యాపారి జామి సంతోష్ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గొడౌన్‌కు అప్పగించినట్లు సీఎస్‌డీటీ మధుసూదనరావు తెలిపారు.

దోపిడీ దొంగలు అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు చూపిస్తున్న పోలీసులు

- 14 బైక్‌లు, 57 సెల్‌ఫోన్లు స్వాధీనం

బరంపురం: బరంపురం పోలీసు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టిన పోలీసులు దోపిడీ దొంగలను అరెస్టు చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. ఈ మేరకు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సర్వాణ్ వివేక్ విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. కొద్దిరోజుల నుంచి బరంపురం నగరం మరియు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగతనాలకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలియజేశారు. వారి దగ్గర నుంచి 14 మోటర్ బైకులు, 57 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో ఎల్.శివరెడ్డి, ఉపేంద్ర నాయక్, శ్రీకాంత్ పాడి మరియు ఇద్దరు మైనర్లు ఉన్నట్లు వెల్లడించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సర్వాణ్ వివేక్

పెద్ద మనసు చాటుకున్న హైటెక్ మెడికల్ ఎండీ

పర్లాకిమిడి: ఒక పేద రైతుకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు వచ్చి హైటెక్ మెడికల్ ఎండీ రూపేష్ పాణిగ్రాహి పెద్ద మనసు చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ దేవుదళ గ్రామానికి చెందిన పేద రైతు మధు మిశాల్ తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న హైటెక్ మెడికల్ (భువనేశ్వర్) ఎండీ రూపేష్ పాణిగ్రాహి ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లతో మాట్లాడారు. రైతుకు మెరుగైన వైద్యం అవసరమవ్వడంతో డాక్టర్లని సంప్రదించి, మెరుగైన వైద్యం నిమిత్తం భువనేశ్వర్ హైటెక్ మెడికల్‌కు తరలించారు. ఆయనకు వైద్యం ఖర్చులు హైటెక్ మెడికల్ భరిస్తుందని తెలియజేశారు.



మధు మిశాల్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూపేష్ పాణిగ్రాహి

సీతకు అరుదైన అవకాశం



- ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర వేడుకను వీక్షించేందుకు ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్:

ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకలను వీక్షించేందుకు చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన ఉపాధిహామీ వేతనదారు యందవ సీతకు ఆహ్వానం అందింది. దేశవ్యాప్తంగా 1800 మందికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానిస్తోంది. వీరిలో సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, రైతులు, నర్సులు, మత్స్యకారులు, కూలీలు తదితర వర్గాలకు చెందిన వారు ఉంటారు. ఉపాధిహామీ వేతనదారుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి అవకాశం లభించగా అందులో సీత ఒకరు. ఈ నెల 13వ తేదీన గన్నవరం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నారు.

సంతోషంగా ఉంది

ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలు టీవీలో చూస్తేనే ఎంతో గొప్పగా ఉంటాయి. అలాంటి వేడుకలకు దగ్గరుండి వీక్షించేందుకు అవకాశం లభించడం ఆనందంగా ఉంది. మూడు రోజుల కిందట ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఆ తరువాత జిల్లా అధికారులు ఫోన్ చేశారు. ఈనెల 13న గన్నవరం నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. జీవితంలో మరిచిపోలేని సంఘటన ఇది. డిగ్రీవరకు చదువుకున్నాను. డైట్ శిక్షణ కూడా పొందాను. గత ఏడాది డిసెంబర్ వరకు ప్రైవేటు పాఠశాలలో పని చేసాను. ఆరోగ్య సమస్య తలెత్తడంతో మానేసి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాను.

– యందవ సీత, రామలింగాపురం గ్రామం, చీపురుపల్లి మండలం

గర్వంగా ఉంది

ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతనదారులు ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను వీక్షించేందుకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవడం గర్వంగా ఉంది. ఉపాధిహామీ పనుల కల్పనలో విజయనగరం జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

బీజేడీ నూతన కార్యవర్గం ఏర్పాటు

రాయగడ: అధికార బీజేడీ పార్టీ రాయగడ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ మేరకు పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబిదాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా 14 మంది నియమితులయ్యారు. వారిలో రంజిత్‌కుమార్ పాణిగ్రహి, బి.తిరుపతిరావు, రతన్ లాల్ జైన్, రవీంద్ర నాథ్ పండ, జి.శ్రీనివాస్‌రావు, డొంబురుధర్ మాఝి, అశ్విని గొమాంగొ, ధవలేశ్వర్‌నాయుడు, దమా కాలిబత్ర, సంతోష్ మహంతి, పి.గౌరిశంకర్, బినాయక్ కర్, బిజయ్‌చౌదరి, సత్యనారాయణ పాడిలు ఉన్నారు. అదేవిధంగా సాధారణ కార్యదర్శులుగా 15 మందిని పార్టీ అధిష్టానం నియమించింది. వీరిలో లక్ష్మణ్ పెద్దింటి, జగన్నాథ సుంద్రుక, నంద చౌదరి, పూర్ణచంద్ర గౌడొ, కృష్ణ ప్రసాద్ పాఢి, కైలాస్ నాయక్, టున్నా గౌడొ, పి.సాయికృష్ణ, దుర్గా ప్రసాద్ సాహు, నవీన్ పిప్పాలి, లక్ష్మీనారాయణ నొందొ, అశోక్ పండ, గంగాధర్ పువ్వల, భాస్కర పట్‌జొషి, ఇప్పిలి సన్యాసిరాజులు ఉన్నారు. అలాగే కార్యదర్శులుగా జగదీష్ చంద్ర మహపాత్రో, బి.సింహాచల్ పాత్రో, భరత్ హిక బడి, అశ్విని పలక, జి.శివప్రసాద్, సీతారాం సాహు, గోపినాథ్ పెరిసిక, మంగళ దివాకర్, ఎం.ప్రసాద్, జగదీష్ నాయక్ బెహర, బిజయ్ సబర్, రఘునందన్ నాయక్, ఎం.గంగాధర్, పి.మురళి, బినోద్ నాయక్, దూడల శ్రీనివాస్‌రావు, వి.కిరణ్‌కుమార్, సహ కార్యదర్శులుగా చంద్రశేఖర్‌నాయుడు, సింహాచల్ రాణా, బిరిసింగ్ కుంభారిక, సహదేవ్ గంట, బలరాం బాగ్, ధనమజ్జి కుంభారిక, బిశ్వనాథ సబర్, కె.సోమేశ్వరరావు, సుభాస్ సబర్, లక్ష్మణరావు, రాము తుబాటి, భీమా హిమిరిక, ధొబా మజ్జిలు నియమితులయ్యారు. కోశాధికారిగా గోపాలకృష్ణ పట్నాయక్‌లు నియమితులైనట్లు పేర్కొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



వరినాట్లు వేస్తున్న మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా నియోజకవర్గంలోని పిండికి, చంద్రగిరి ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట భూముల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది వర్షాభావం వలన మోహనా సమితిలో వరినాట్లు ఆలస్యంగా జరుగుతున్నాయి.

భార్యను కొట్టిన భర్తకు రెండేళ్ల జైలు

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన కురమాన లావణ్యను తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఇనుపరాడ్డుతో తలపైన కొట్టి గాయపరిచినట్లు నమోదైన కేసులో భర్త కుమార్‌కు రెండేళ్ల జైలుశిక్ష, జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ భర్త నిత్యం పెడుతున్న వేధింపులే కాకుండా తలపై కొట్టినట్లు లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడిని అరెస్టుచేసి బొబ్బిలి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశామన్నారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.4వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గరుగుబిల్లి పాపారావు(45) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో భార్య పది రోజుల కిందట కన్నవారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన పాపారావు ఇంట్లో ఫ్యాన్‌హుక్‌కు ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి

పర్లాకిమిడి: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ మేరకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌కు అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య కన్వీనర్ ఎం.రవికుమార్, అధ్యక్షుడు ఎస్.డిల్లేశ్వరరావులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం అనుసరించి ఉపాధ్యాయుల విద్యార్హతల ఆధారంగా మూలవేతనం లెవల్–9కి పెంచుతూ, రూ.4,200 గ్రేడ్‌పే మంజూరు చేయాలని కోరారు. లేదంటే ఆగస్టు 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఉపాధ్యాయులు సామూహిక సెలవుల్లోకి వెళ్తామని హెచ్చరించారు. గతేడాది రాష్ట్ర గణశిక్ష మంత్రి హామీ మేరకు ఇచ్చిన జీవో అమలు చేయకపోవడంతో ఆందోళనబాట పడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో సుమంత్ చింతాడ, దేబరాజ్ జెన్నా, శ్రావణ్‌కుమార్, సుజాతా నంద, మనోజ్ గంతాయత్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సబ్ జైల్ సందర్శన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన కోట్‌పాడ్ సబ్ జైలు, బొయిపరిగుడలో వృద్ధాశ్రమాలను శుక్రవారం సందర్శించారు. కొరాపుట్ జిల్లా జడ్జి మరియు జిల్లా న్యాయసేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర ఆదేశం మేరకు సుమన్ జెన న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, జైలు పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే తెలియజేయాలని, వారి కేసులు వాదించేందుకు ఉచిత న్యాయ సహాయం అందించగలమని ఖైదీలకు చెప్పారు. అనంతరం బొయిపరిగుడ వృద్ధాశ్రమాన్ని సందర్శించి ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులతో మాట్లాడారు. ప్రతినెలా డాక్టర్ వచ్చి వృద్ధులకు వైద్య పరీక్షలు చేయాలని జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు.



న్యాయ సహాయంపై ఖైదీలతో మాట్లాడుతున్న దృశ్యం



వృద్ధులతో మాట్లాడుతున్న సుమన్ జెన

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సాబొరొ తదితరులు

రాయగడ: పట్టణానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లోయిస్ (ఇంఫా) కర్మాగారం ఆధ్వర్యంలో కన్యా ఎక్స్‌ప్రెస్ పేరిట ప్రచార రథం శుక్రవారం ప్రారంభమైంది. రాయగడ సబ్ కలెక్టర్ భీమసేన్ సాబొరొ ముఖ్య అతిథిగా హాజరై రథాన్ని ప్రారంభించారు. ఇంఫా వ్యవస్థాపకుడు బంశీధర్, ఇలావందా ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రచార రథంను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం వలన మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు రథాన్ని ప్రారంభించినట్లు ఇంఫా కర్మాగారం అధికారి ఎం.శ్రీనివాస్ తెలియజేశారు. కర్మాగారం పరిసర ప్రాంతాల్లో తిరిగే ఈ రథం ద్వారా అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, యువతులకు పౌష్టికాహారం పంపిణీ, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమయ్యే మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంఫా ఆస్పత్రి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రసాంత కుమార్ కొరా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మోసగాళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పాత బంగారం తీసుకుని, కొత్తవస్తువులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సైలు భాస్కరరావు, అశోక్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్‌ఎంకె జ్యూయలరీ షాపు యజమానులైన నాగులకొండ వెంకటకిశోర్, నాగులకొండ వెంకట శ్రీపాణిలు కొంతమంది కొనుగోలుదారుల నుంచి బంగారు వస్తువులు చేసేందుకు గాను పాత బంగారం తీసుకుని, కొత్తవస్తువులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు రెండు చీటింగ్ కేసులు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇటువంటి మోసాలు జరుగుతున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తుల గత చరిత్ర పరిశీలించి విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త వహించాలని హితవు పలికారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సైలు భాస్కరరావు, అశోక్ కుమార్ (వెనుక ముసుగులో నిందితులు)

మన్యం బడులకు ▶ పురస్కారాల పంట

- పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు విద్యాలయాలు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక
- ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ప్రథమస్థానం

సీతంపేట/గుమ్మలక్ష్మీపురం/వీరఘట్టం:

ఏజెన్సీలో అక్షర సేద్యం ఊపందుకుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో సరస్వతీ నిలయాల్లో చదువుల యజ్ఞం నిర్విఘ్నంగా సాగుతోంది. నాడు–నేడు కింద ప్రభుత్వ బడుల కు ఆధునిక సొబగులు అద్దడం, చదువులకు అలవాలంగా తీర్చిదిద్దడం, పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్నవిద్యాకానుకలు అందించడం, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి వంటి పథకాలు అమలుచేయడం, ఎంఈఓలు, డీఈఓ, రాష్ట్రస్థాయి అధికారుల నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులు చక్కని బోధన ప్రణాళికలు అమలు వంటివి సత్ఫలితాలిస్తున్నాయి. మన్యం విద్యార్థుల్లో అక్షర చైతన్యం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమస్థానంలో నిలిచి అందరి చూపును ఆకర్షించింది.

ఎనిమిదిలో నాలుగు మనవే...

ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేయగా, అందులో పార్వతీపురం మన్యం జిల్లాలోని పాఠశాలలే నాలుగు కావడం గమనార్హం. వీటిలో వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ, సీతంపేట బాలికోన్నత పాఠశాల, జియ్యమ్మవలస జిల్లా పరిషత్ హైస్కూల్, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల అధికారులకు సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. కొత్త జిల్లాగా ఏర్పడిన ఏడాదిలో చదువుల విప్లవం ఊపందుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల



రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపికైన భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ (పీటీజీ)

పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు జిల్లాకు తలమానికంగా నిలిచాయి. మొత్తం 10,694 మంది విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షలు రాయగా 9,356 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 7,865 మంది ప్రథమ, 1151 మంది ద్వితీయ, 340 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 587 మార్కులతో పాలకొండకు చెందిన పాడి హేమలత జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. 585 మార్కులతో కురుపాంకు చెందిన కె.తనుశ్రీ, సాలూరుకు చెందిన కర్రి షర్మిలలు ద్వితీయ స్థానంలో నిలిచారు. గరిష్ట మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాల అవార్డులను సొంతం చేసుకున్నారు.

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల (పీటీజీ)లో చదువుతున్న విద్యార్థులు 2011 నుంచి 2023 వరకు వరుసగా పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అత్యధికమంది బాలికలు 500 మందికి పైగా మార్కులు సాధించడం, ట్రిపుల్ ఐటీకీ ఎంపిక కావడంతో పాఠశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచింది. రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన సీతంపేట ప్రభుత్వ ఉన్న పాఠశాల నుంచి ఈ ఏడాది 51 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. 500లు పైబడి మార్కులు 20 మందికి వచ్చాయి. ట్రిపుల్ ఐటీకి ఐదుగురు, నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు మరో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగేళ్లుగా శతశాతం ఫలితాలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 240 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చక్కని బోధన



పాఠశాలలో చక్కని బోధన ప్రణాళికను అమలుచేస్తున్నాం. ప్రతీ విద్యార్థిని మెరికల్లా తీర్చిదిద్దుతున్నాం. అందుకే ఫలితాల్లో మేటిగా నిలుస్తున్నాం. ఉపాధ్యాయుల సమష్టి కృషికి అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– వై.హేమసుందరరావు, హెచ్‌ఎం, సీతంపేట

ఉపాధ్యాయుల కృషి ఫలితం



సర్కారు బడులకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి హంగులు కల్పించింది. వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. అక్షర సేద్యంలో మేటిగా నిలిచి ముందుముందు మరిన్ని పురస్కారాలను సొంతం చేసుకోవాలి.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, పార్వతీపురం మన్యం


సమష్టి కృషితోనే..



మా పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. మా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సమష్టి కృషికి గుర్తింపు లభించింది. పాఠశాల నుంచి 22 ఏళ్లుగా విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తుండగా 17 ఏళ్లు శతశాత ఉత్తీర్ణత నమోదైంది. బాలికల భవిష్యత్తుకు గట్టిపునాది వేస్తున్నాం.

– ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్, ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ (పీటీజీ)

ఆనందంగా ఉంది



కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు పాఠశాలలు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితానికి నిదర్శనం ఇది. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా కీర్తిని దేశ వ్యాప్తంగా చాటి చెప్పాలి.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

జగన్‌మామకు రుణపడి ఉంటాం



మారుమూలన ఉన్న ఇలాంటి పాఠశాలను గుర్తించినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి విద్యార్థులమంతా రుణపడి ఉంటాం. మా పాఠశాల ఉపాధ్యాయులు బాగా చదువు చెప్పడంతో నాకు టెన్త్‌క్లాస్‌లో 563 మార్కులు వచ్చాయి. ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సులో చేరాను. కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటాను.

– సీహెచ్.సుష్మశ్రీ, విద్యార్థిని, సీతంపేట

క్లుప్తంగా

14న అప్రెంటిస్‌షిప్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 14న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లండ సుధాకర్ రావు చెప్పారు. ఐటీఐలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని అన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల రెండు సెట్ల జిరాక్సులతో రావాలన్నారు. బయోడేటా ఫారం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్సులు ఉండాలని, రెండు కలర్ ఫొటోలు అవసరమని తెలిపారు. అరబిందో ఫార్మా, రెడ్డీస్ ల్యాబ్, నాగార్జునా అగ్రికెం, స్మార్ట్ కెం, ఉషోదయ పబ్లికేషన్స్ వంటి 12 కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. రెండేళ్ల ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు విద్యార్థులు ఫోన్ నంబర్లు 9666841306, 9441944549లను సంప్రదించాలని చెప్పారు.

విదేశీ విహంగానికి రక్షణ



విదేశీ విహంగాన్ని కాపాడుతున్న ఆర్టీసీ సిబ్బంది

కాశీబుగ్గ: రెక్కలకు దెబ్బలు తగిలి పలాస ఆర్టీసీ డిపో ఆవరణలో పడిపోయిన విదేశీ విహంగానికి సెక్యూరిటీ సిబ్బంది రక్షణ కల్పించారు. విధుల్లో ఉన్న గురుగుబెల్లి రామమోహనరావు పక్షికి అవసరమైన నీటిని, ఆహారాన్ని అందించారు. అనంతరం ఫారెస్టు అధికారులకు, తేలినీలాపురం పక్షుల కేంద్రం బాధ్యులకు సమాచారం అందించారు. విద్యుత్ తీగల వల్ల పక్షి కుడిరెక్క దెబ్బతిని ఉంటుందని, స్థానిక వైద్యులతో చికిత్స చేయిస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఆర్టీసీ గ్యారేజీలో ఉన్న సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు సపర్యలు చేశారు.

సింగుపురం కేజీబీవీ సందర్శన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం చైల్డ్ రైట్ కమిషనర్ చైర్మన్ అప్పారావు, మెంబర్స్ గొండు సీతారాంలు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. కోడిగుడ్ల సైజుపై విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గుడ్లు పరిమాణం పెద్దవి ఉండేవి సరఫరా చేయించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియెట్‌లో టాపర్స్‌గా నిలిచిన వారిని అభినందించారు.

బీచ్‌లు అభివృద్ధి చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తీర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా గుర్తించిన 67 బీచ్‌లు, కోస్టల్ జోన్ మేనేజ్ మెంట్ అథారిటీ ప్లాన్‌పై శుక్రవారం జిల్లా పర్యాటక మండలి సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపికైన బీచ్‌ల మ్యాప్‌లను రూపొందించే ముందు సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించాలన్నారు. సముద్ర ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో టూరిజం అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టుపై విశదీకరించాలని అధికారులను కోరారు. అలాగే టూరిజం అభివృద్ధికి ప్రాజెక్టును వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరారు. ఫిషరీస్ విశ్వ విద్యాలయం, పర్యాటక, మత్స్యశాఖలతో కూడిన 11 ప్రత్యేక బృందాలు తీరం వెంట సర్వే నిర్వహించి బీచ్‌ల అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించాయని తెలిపారు.

గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థులు పరారు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం సమీపంలోని పెదపాడు సాంఘిక సంక్షేమ శాఖ అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం వేకువజామున ఇద్దరు విద్యార్థులు స్కూలు గేటు దూకి పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఉదయం 4.30 సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు బయటకు వచ్చారు. వీరిలో ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సిబ్బంది కళ్లు గప్పి పరారయ్యారు. ఇందులో ఒక విద్యార్థిది ఆడవరం కాగా, మరో విద్యార్థిది శ్రీకూర్మం వద్ద సింతువలస గ్రామం. వీరు స్కూల్ నుంచి వెళ్లిపోతుండగా దారిలో ఓ వ్యక్తి చూసి గుర్తుపట్టి వారి తల్లిదండ్రులకు విషయం చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్దకు వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ సిబ్బంది అంతా తల్లిదండ్రులను బతిమలాడడంతో సయోధ్య కుదిరింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. అయితే ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. వివరాల్లోకి వెళ్తే.. సుమారు యాభై ఏళ్ల వయసు గల వ్యక్తి పలాస సమీపంలోని ప్రమోద్ దాబా వద్ద శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఓ వాహనం అతి వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. ఢీకొట్టడమే కాకుండా అతడిపై నుంచి వాహనం వెళ్లిపోవడంతో శరీరం ఛిద్రమైపోయింది. ముఖం సైతం గుర్తు పట్టని విధంగా మారిపోయింది. కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి వివరాలు సేకరించారు.

మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా సముద్రం లోపలకు జరుగుతున్న బ్రేక్ వాటర్ పనులు(స్టోన్ ఫిల్లింగ్)



శరవేగంగా..

- రెండు నెలల్లోనే 350 మీటర్ల వరకు సౌత్ బ్రేక్ వాటర్ పనులు
- సెప్టెంబర్ నెలలో ఆరంభం కానున్న నార్త్ బ్రేక్ వాటర్ వర్క్
- బెర్తుల నిర్మాణానికి చకచకా ఏర్పాట్లు
- ప్రాథమిక పనుల్లో స్థానికులకే ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యం

టెక్కలి: సిక్కోలు తీరానికి మణిహారంగా నిలవనున్న మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన కొద్ది రోజులకే పోర్టు పనులు ఆరంభించారు. ఇందులో భాగంగా ఇప్పటికే బ్రేక్ వాటర్ పనులు, ఫైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణానికి మట్టి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరో వైపు నిర్వాసితులకు అందాల్సిన పరిహారాలను విడతల వారీగా అందజేస్తున్నారు. వీటితో పాటు పోర్టు నిర్మాణంలో ప్రాథమికంగా అవసరమైన సిబ్బందిని స్థానికుల నుంచే తీసుకుంటున్నారు.

సౌత్ బ్రేక్ వాటర్ పనులు

పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులకు సంబంధించి(స్టోన్ ఫిల్లింగ్) విశ్వ సముద్ర సంస్థ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇప్పటికే సముద్రంలోకి 350 మీటర్ల మేరకు సౌత్ బ్రేక్ వాటర్ పనులు చేపట్టారు. మొత్తం 2.4 కిలోమీటర్ల మేరకు ఈ పనులు చేపట్టాల్సి ఉంది. మరో రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నారు. అలాగే సెప్టెంబర్ నెల నుంచి నార్త్ బ్రేక్ వాటర్ పనులను ప్రారంభించనున్నారు. ఇది మొత్తం 580 మీటర్ల వరకు చేపడతారు. వీటితో పాటు బెర్తుల నిర్మాణానికి అవసరమైన మట్టి పనులను చేపడుతున్నారు. అంతే కాకుండా ఫైలింగ్ పనులతో పాటు ప్రాజెక్టు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.



పోర్టు నిర్మాణంలో భాగంగా సముద్రం లోపలకు వేస్తున్న రోడ్డు

దశల వారీగా పరిహారం

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులతో పాటు మరో వైపు నిర్వాసితులకు వివిధ రకాల పరిహారాన్ని అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల జీడి చెట్ల పరిహారాన్ని అందజేశారు. మొత్తం 2500 జీడి చెట్లుకు సంబంధించి ఇప్పటికే మొదటి విడతగా 358 జీడి చెట్లకు సంబంధించి మొదటి విడతగా ఇటీవల రూ.9 లక్షల పరిహారాన్ని అందజేశారు. రెండో విడతగా మరో వారం రోజుల్లో పరిహారాన్ని అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు 3వ విడతగా ఆయా రైతుల సమక్షంలో జీడి చెట్లను లెక్కించే ప్రక్రియ ప్రారంభించనున్నారు. లెక్కింపు పూర్తయిన తర్వాత పరిహారాన్ని అందజేస్తారు. అంతే కాకుండా మూలపేట, విష్ణుచక్రంతో పాటు మరి కొన్ని గ్రామాలకు వెళ్లే మార్గాన్ని పటిష్టం చేస్తున్నారు. కల్వర్టులు ఉన్న చోట వంతెనల నిర్మాణం చేపడుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో..

మూలపేట పోర్టు నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపడుతున్నాం. పోర్టు నిర్మాణానికి స్థానికంగా అవసరమైన అన్ని రకాల అనుమతులతో పనులు వేగవంతం చేస్తున్నాం. బ్రేక్ వాటర్ పనులకు అవసరమైన స్టోన్స్‌తో పాటు గ్రావెల్‌కు సంబంధించి ప్రభుత్వానికి కట్టాల్సిన ఫీజును చెల్లించి తవ్వకాలు చేస్తున్నాం. అంతే కాకుండా ఉపాధి అవకాశాల విషయంలో స్థానికులకే ప్రాధాన్యత కల్పిస్తున్నాం. గ్రామస్తులకు అవసరమైన రోడ్డు మార్గాన్ని సైతం మరింత పటిష్టం చేస్తున్నాం.

– ఎం.శంకర్, జీఎం, విశ్వసముద్ర నిర్మాణ సంస్థ

స్థానికులకే ప్రాధాన్యత

పోర్టు నిర్మాణంలో భాగంగా ప్రాథమిక పనుల్లో స్థానికులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 30 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మందికి ఉపాధి కల్పించారు. భవిష్యత్‌లో అవసరమైన మేరకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఉద్యోగం పేరిట రూ.6 లక్షలకు టోపీ

గార: మాయమాటలు చెప్పడం.. డబ్బులు గుంజుకోవడం.. ఆ డబ్బుతో జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్న వ్యక్తిపై గార పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలాకి మండలం ఇలపండపేటకు చెందిన ఇలపండ వేణుగోపాలరావు తనకు విజయవాడలో ఉన్నతాధికారులతో మంచి పరిచయం ఉందని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో వారు డబ్బులు అడిగితే ప్రజా ప్రతినిధులు తనకు బంధువులంటూ బెదిరిస్తున్నాడు. గార ఇసుక ర్యాంపులో పనిచేస్తున్న వంజంగి లోకనాథం ఇలాగే మోసపోయాడు. లోకనాథంకు తన బావ ద్వారా వేణుగోపాలరావు పరిచయమయ్యాడు. హోంగార్డు పోస్టులున్నాయని చెప్పడంతో ఆయన మాటలు నమ్మిన లోకనాథం రూ.6 లక్షలు ఇచ్చాడు. ఇప్పటికే ఆరు మాసాలైనా ఉద్యోగం లేకపోవడంతో వేణును నిలదీశాడు. అయితే ప్రజాప్రతినిధులు తన బంధువులని, ఎక్కువగా మాట్లాడితే ఇబ్బంది పడతావని వేణు తిరిగి బెదిరింపులకు దిగాడు. దీంతో లోకనాథం శుక్రవారం గార పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు దర్యాప్తు ప్రారంభించాడు. వేణుగోపాలరావుపై గతంలో కూడా శ్రీకాకుళం టూటౌన్, వన్‌టౌన్, సంతబొమ్మాళి, హిరమండలం, సరుబుజ్జిలిలో కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇతడు తరచూ కార్లు కూడా మారుస్తుంటాడు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని పోలీసులు హితవు పలికారు.



డబ్బులు తీసుకున్న ఇలపండ వేణుగోపాలరావు (ఫైల్)

జూనియర్ అసిస్టెంట్ మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి మురళీకృష్ణ తెలిపారు. వీరికి ప్రొఫిషియన్సీ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల జాబితా కలెక్టరేట్‌లో, మండల తహసీల్దారు కార్యాలయం నోటీస్ బోర్డులో, శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, 1:2 నిష్పత్తిలో జాబితా ఉంటుందని తెలిపారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు అర్హులైన విద్యార్థులు వచ్చేనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న వారు అర్హులని చెప్పారు. ఈ ఏడాది ఎనిమిదో తరగతి చదువుతూ.. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులు అర్హులని అధికారులు పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించి వచ్చేనెల సెప్టెంబర్ 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 3వ తేదీన జరుగుతుందని డీఈఓ వెంకటేశ్వరరావు చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్‌వెబ్‌పోర్టల్‌లో లేదా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్య వ్యాపారమైపోయింది

- పీపుల్స్ స్టార్ నారాయణమూర్తి

టెక్కలి: కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలన్నీ కలిసి విద్యను వ్యాపారంగా మార్చేశాయని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రణవి విద్యా సంస్థల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను తెరకెక్కించిన 'యూనివర్సిటీ' చిత్రం అక్టోబర్‌లో విడుదలవుతున్న సందర్భంగా జిల్లాలో పలు విద్యా సంస్థల్లో పర్యటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు తమ విద్యా సంస్థల్లో చదువుతున్న వారికి అత్యధిక ర్యాంకులు సాధించడానికి పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి సమస్యలను ఎత్తి చూపుతూ తాను యూనివర్సిటీ చిత్రాన్ని రూపొందించానని పేర్కొన్నారు. అభ్యుదయవాదులు, విద్యార్థులంతా తన సినిమాకు ప్రచారం చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ప్రణవి విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.పరమేశ్వరరావు, ప్రతినిధులు పి.చంద్రశేఖర్ ఆజాద్, పి.సూర్యనారాయణ, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి మండలం పాతనౌపడ సమీపంలో ప్రణవి విద్యా సంస్థలో పర్యటిస్తున్న పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి.

తెలుగు భాషకు వన్నె 'అవధానం'

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషకు వన్నె తెచ్చింది 'అవధాన' ప్రక్రియ అని, మరే ఇతర భాషల్లో ఈ ప్రక్రియ ఉండదని ఏలూరుకు చెందిన అవధాని వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సంపూర్ణ శతావధానం కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ఈ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ తాను ఇలాంటి సభల్లో పాల్గొనడం ఇదే మొదటి సారని, ఇలాంటి మంచి సభకు ఆహ్వానించినందుకు ఆనందంగా ఉందని అన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రారంభమైన అవధాన ప్రక్రియలో 25 సమస్యాపూరణలు, 25 దత్తపదులు, 25 వర్ణనాంశాలు, 25 ఆశువులతో ప్రారంభమైంది. ఈ శతావధాన ప్రక్రియకు సంచాలకులుగా హైదరాబాద్‌కు చెందిన కోటడ వెంకట లక్ష్మీనరసింహం, అప్రస్తుత ప్రసంగీకులుగా సురభి శంకరశర్మ, దండిభోట్ల దత్తాత్రేయశర్మలు వ్యవహరించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా కూచిపూడి నృత్యాల ప్రదర్శన జరిగింది.



సంపూర్ణ శతావధానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆహా ఏమి రుచి..!



పిండి వంటకాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

- రేషన్ బియ్యంతో చేసిన వంటకాల ప్రదర్శన
- రుచిచూసిన జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జ్ కలెక్టర్

విజయనగరం అర్బన్: ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న ఫోలిక్ యాసిడ్, ఐరన్ కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యంతో మహిళలు చేసిన వంటకాలు భలే రుచి అనిపించాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ సమావేశ మందిరంలో శుక్రవారం పోర్టిఫైడ్ బియ్యంతో తయారు చేసిన వంటకాల పోటీలు, ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 104 స్టాల్స్‌లో మహిళలు పోర్టిఫైడ్ బియ్యంతో చేసిన వివిధ రకాల సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తిలకించి వంటకాలను రుచి చూసి, తయారు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

మొదటిసారిగా జిల్లాలోనే సరఫరా

ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ పోర్టిఫైడ్ బియ్యంలో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయని, ఈ బియ్యం వాడిన వారికి బలం కోసం వేరే మందులు వాడనవసరం ఉండద న్నారు. జిల్లాలో రక్తహీనత అధికంగా ఉన్న నేపథ్యంలో మన జిల్లాలోనే మొదటి సారిగా ఈ బియ్యాన్ని పీడీఎస్ ద్వారా సరఫరా చేశామని ప్రస్తుతం ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రతి కేజీ బియ్యానికి ప్రభుత్వం రూ.50 వరకు ఖర్చు చేస్తోందని ఈ బియ్యాన్ని తక్కువగా చూడొద్దని తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఎన్ని రకాల వంటకాలు తయారు చేయవచ్చునో ఈ ప్రదర్శన ద్వారా అందరికీ అర్థమవుతుందని ఈ బియ్యాన్ని ఎవ్వరూ అమ్ముకోవద్దని హితవు పలికారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, వ్యవసాయ శాఖ ఎ.డి అన్నపూర్ణ, సీడ్ కార్పొరేషన్ మేనేజర్ పద్మ, డివిజనల్ పీఆర్‌ఓ జానకమ్మ వ్యవహరించారు. మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పాల్గొన్నారు.

ఉచితంగా బియ్యం సరఫరా

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రేషన్ బియ్యంపై వస్తున్న లేనిపోని అపోహలు సరికాదని ఎంతో బలవర్ధకమైన బియ్యం ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి ప్రజా పంపిణీ ద్వారా ఉచితంగా పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తోందని, ప్రజలంతా తప్పకుండా వినియోగించాలని కోరారు.

ఆటకు ఆందలం



కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్న యువత

- 38 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరం
- 5 క్రీడాంశాలు..5 స్థాయిల్లో పోటీలు
- విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇప్పటికే విద్యాభివృద్ధికి పెద్ద పీట వేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా ఆటలకూ పెద్ద పీట వేశారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు నుంచి ప్రారంభించే పోటీలకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. 38 రోజుల పాటు నిర్వహించే క్రీడా సంబరానికి జిల్లాస్థాయిలో సెట్విజ్ ఆధ్వర్యంలో జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి.

5 అంశాలు..5 స్థాయిల్లో పోటీలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ టోర్నమెంట్‌లో 5 క్రీడాంశాల్లో..5 స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాంశాలకు సంబంధించి 17 సంవత్సరాల వయస్సు నిండిన క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు. మొదటిగా క్షేత్ర స్థాయిలో సచివాలయ స్థాయిలో పోటీలు నిర్వహించనుండగా... అందులో విజేతలుగా నిలిచిన జట్లు మండల స్థాయిలో తలపడతాయి. అక్కడ విజేతలుగా నిలిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించి పోటీలు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతాయి. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచి సత్తా చాటిన జట్లను నవంబర్1 నుంచి 8వ తేదీ వరకు విశాఖ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

సెప్టెంబర్ 2 నుంచి ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం

క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యువతను ప్రోత్సహించడం, జీవన నాణ్యతను మెరుగుపర్చడానికి గల మార్గాలపై అవగాహన కల్పించాలనేది ఆడుదాం ఆంధ్రా ప్రధాన ఉద్దేశం. సచివాలయ స్థాయి నుంచి నిర్వహించే పోటీలకు సంబంధించి సెప్టెంబర్ 2 నుంచి ఆసక్తి గల క్రీడాకారుల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. క్రీడాకారులు ఆయా సచివాలయాల పరిధిలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో 626 సచివాలయాలు.. పార్వతీపురం-మన్యం జిల్లాలో 315 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

యువతను ప్రోత్సహించడమే లక్ష్యం



యువతను క్రీడారంగంలో ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సెప్టెంబర్2 నుంచి వివరాలను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి. ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో అర్హత, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు.

– బి. రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్.

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, రూ.10వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, జిల్లా స్థాయిలో రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.లక్ష (ప్రథమ), రూ.50వేలు (ద్వితీయ), రూ.30వేలు (తృతీయ) బహుమతులు అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ , ఖోఖో, క్రికెట్ విజేతలకు రూ. 5 లక్షలు (ప్రథమ), రూ.3లక్షలు (ద్వితీయ), రూ.2లక్షలు (తృతీయ) నగదు బహుమతులు అందజేస్తారు.

సమస్యల పరిష్కారానికే 'పోలీస్ సంక్షేమ దివస్'

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే పోలీస్ సంక్షేమ దివస్ ప్రధాన ఉద్దేశమని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంక్షేమదివస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పోలీసులు తెలియజేసిన సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్:

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించి వచ్చేనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్ 3న పరీక్ష నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పూర్తి వివరాలకు 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోను, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.